
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

గురువారం 9 అక్టోబరు 2025

రోడ్లు చిద్రం..
వంతెనలు శిథిలం

- గంగాపూర్-ర్యాకల్ మధ్య వాగు వంతెన ప్రమాదకరం
- భారీ వాహనాలకు దారి మూసివేత
- రోడ్లపై మోకాలు లోతు గుంతలతో ప్రయాణం నరకం

7

ఈ సీజన్ మొదట్లో ఆశాజనకంగా ఉన్న పత్తి పంట, ఆగస్టు నెలాఖరు నుంచి కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. నెల రోజులకుపైగా ఎడతెరిపి లేకుండా కురిసిన వానల కారణంగా వేలాది ఎకరాల్లో పత్తి పంట నీట మునిగి రైతులను నట్టేట ముంచాయి. సంగారెడ్డి జిల్లాలో సాగు చేసిన పంటలో సగానికిపైగా నీట మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. గతేడాదితో పోలిస్తే ఈసారి పత్తి దిగుబడి గణనీయంగా తగ్గే పరిస్థితి నెలకొనడంతో దూది రైతుకు దుఃఖమే మిగిలింది.



దూది రైతు దుఃఖం

నట్టేట ముంచిన వానలు

సగానికిపైగా దెబ్బతిన్న పంట

సంగారెడ్డి జిల్లాలో దిగుబడిపై తీవ్ర ప్రభావం

ఎకరాకు 5-8 క్వింటాళ్లు రావడం గగనమే!



మొక్క ఎదుగుదల దశలోనే దెబ్బతిన్న పంట (ఫైల్)

సంగారెడ్డి టౌన్/మునిపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 3,48,775 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అధికారులు మొదట 2,79,020 మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అంచనా వేశారు. అయితే భారీ వర్షాల కారణంగా సుమారు రెండు లక్షల ఎకరాలకుపైగా పత్తి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీంతో ఈసారి పరిస్థితి మరింత దారుణంగా ఉండనుంది.

మెదక్ జిల్లాలోనూ ముంపు

మెదక్ జిల్లాలోనూ 34 వేల ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంట భారీ వర్షాలకు చాలా చోట్ల ముంపునకు గురైంది. రేగోడ్, అల్లాదుర్గం, టేక్మాల్ మండలాల పరిధిలో సుమారు 473 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు సర్వేలో

మిగతా 8వ పేజీలో

ఖాత, పిందె దశలోనే దెబ్బ

సంగారెడ్డి జిల్లాలో గత సీజన్ (2024-వానాకాలం సీజన్‌లో) జిల్లా వ్యాప్తంగా 3,49,665 ఎకరాల్లో పత్తిని సాగు చేయగా 4,19,597 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి రావచ్చని అంచనా వేశారు. అప్పట్లో అధికారుల అంచనాలకు భిన్నంగా 1,56,643 మెట్రిక్ టన్నుల పత్తిని మాత్రమే సీసీఐ, జిన్నింగ్ మిల్లుల ద్వారా కొనుగోలు చేశారు. గతేడాది ఆశించినస్థాయిలో వర్షాలు కురిసినప్పటికీ పత్తి దిగుబడి అంతంతమాత్రంగానే వచ్చింది. ఈసారి సంగతి మరింత దారుణంగా ఉంటుందని చెప్పవచ్చు. మొక్క ఎదుగుదల నుంచి పిందె, ఖాత దశల వరకు వాన దెబ్బ మీద దెబ్బ వేయడంతో దిగుబడి గణనీయంగా పడిపోయే అవకాశం ఉంది. సాధారణంగా ఎకరాకు 12 క్వింటాళ్ల చొప్పున దిగుబడి రావాల్సి ఉండగా, ప్రస్తుత వర్షాల కారణంగా ఎకరాకు కేవలం 5 నుంచి 8 క్వింటాళ్ల చొప్పున మాత్రమే దిగుబడి రావచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. పంట పిందె దశలోనే దెబ్బతినడంతో కనీసం 3 క్వింటాళ్లు కూడా రాకపోవచ్చని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వట్‌పల్లి శివారులో నీట మునిగిన పత్తి(ఫైల్)

కేంద్ర బృందం క్షేత్రస్థాయి పర్యటన

మెదక్ జిల్లాలో వరద నష్టంపై అంచనా

వారి వెంట కలెక్టర్, జిల్లా అధికారులు

రైతులు, స్థానికులతో మాట్లాడిన బృందం



కేంద్ర బృందానికి తెగిన రోడ్ల ఫొటోలు చూపిస్తున్న అధికారులు

మెదక్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా మెదక్ జిల్లాలో జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర బృందం బుధవారం పర్యటించింది. వరదల్లో మునిగిన పంటలు, దెబ్బతిన్న రోడ్లు, వంతెనల వద్దకు బృందం సభ్యులు స్వయంగా వెళ్లి రైతులతో, స్థానికులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు. కేంద్ర బృందంలో డాక్టర్ కే. పొన్నుస్వామి, వినోద్ కుమార్, అభిషేక్ కుమార్, ఎస్ఎస్ పింటు ఉన్నారు. ఉదయం మెదక్ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్న బృందానికి కలెక్టర్ రాహుల్‌రాజ్ స్వాగతం పలికారు. ఆర్థిక, వ్యవసాయ, రోడ్లు - రహదారులు, గ్రామీణాభివృద్ధి, నేషనల్ రిమోట్ సెన్సింగ్ విభాగాల అధికారులు కేంద్ర బృందంతో పాటు పర్యటనలో పాల్గొన్నారు.

కేంద్ర బృందం పరిశీలించినవి

కేంద్ర బృందం పర్యటన ప్రధానంగా దెబ్బతిన్న మౌలిక వసతుల చుట్టూ కొనసాగింది. వరదలకు దెబ్బతిన్న ప్రాజెక్టులు, చెరువు కట్టలను, కల్వర్టులను, జాతీయ రహదారులను బృందం పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసింది.

- మెదక్ నుంచి మక్త భూపతిపూర్ గ్రామానికి చేరుకుని వరదలకు కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. వంతెన కొట్టుకుపోవడంతో సుమారు 20 రోజుల పాటు ఆరు గ్రామాల ప్రజలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని వివరించారు.
- మెదక్ మండలంలోని ఖాజాపూర్-కొంటూర్, తిమ్మానగర్ గ్రామాలకు వెళ్లే రహదారి 9.5 కిలోమీటర్ల మేర కొట్టుకుపోవడంతో జరిగిన నష్టాన్ని బృందం అంచనా వేసింది. మెదక్ మండలం రాయిన్‌పల్లిలో తెగిపోయిన లోలెవల్ కెనాల్ కట్ట, మెదక్ శివార్లలోని అవుసులపల్లి వద్ద కొట్టుకుపోయిన ఖజానా చెరువు కట్టను, పిల్లికోటాల్‌లో పుష్పల వాగు వరదలకు కొట్టుకుపోయిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు.
- మెదక్ - సిద్దిపేట రహదారిపై నిజాంపేట మండలం నందిగామ వద్ద, చల్మెడ సమీపంలో మూడు కిలోమీటర్ల మేర జాతీయ రహదారికి జరిగిన నష్టాన్ని బృందం సభ్యులు అంచనా వేశారు.
- రామాయంపేట మండలం లక్యాతండా నుంచి పర్వతాపూర్ వద్ద పంచాయతీ రహదారి తెగిపోవడంతో ప్రజల రాకపోకలు నిలిచిపోయిన వైనాన్ని పరిశీలించింది.
- హవేళీఘనపూర్ మండల కేంద్రం వద్ద బ్యాతోల్ గ్రామానికి వెళ్లే రహదారి కొట్టుకుపోవడంతో ప్రజలు వారం రోజుల పాటు పడ్డ ఇబ్బందులను బృందం అడిగి తెలుసుకుంది. మండలంలో గండిపడిన పెద్దచెరువు కట్టను పరిశీలించారు.



హవేళీఘనపూర్‌లో కేంద్ర బృందం సభ్యులు

ఏడుపాయలలో

పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గా ప్రాజెక్టు(ఘనపురం ఆనకట్ట)ను పరిశీలించారు. వరదలకు ఆలయం ముంపునకు గురికావడాన్ని గమనించారు. ఆలయ ప్రసాదం కౌంటర్ కొట్టుకుపోయిన విషయాన్ని పురోహితులు వారికి వివరించారు. ప్రాజెక్ట్ ఎడమ కాల్వ పరీవాహక ప్రాంతంలో మునిగిన పంట పొలాల గురించి కూడా ఆరా తీశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని బృందం సభ్యులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పల్లెపోరుకు సిద్ధం

మొదటి విడతలో పది మండలాల్లో..

నామినేషన్ల స్వీకరణకు సిద్ధం చేసుకోండి

జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్

అధికారులతో గూగుల్‌మీట్

మెదక్, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మెదక్ జిల్లాలో మొదటి విడత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ, నామినేషన్ల స్వీకరణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పల్లెపోరులో భాగంగా జిల్లాలో తొలి విడతలతో పది మండలాల్లో ఎన్నికలు నిర్వహించనుండగా, ఇందుకు సంబంధించి ఏర్పాటు పూర్తి చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ అధికారులతో గూగుల్‌మీట్ నిర్వహించారు. మొదటి విడత ఎన్నికలు నిర్వహించే మండలాల నోటిఫికేషన్, నామినేషన్ ప్రక్రియను అధికారులకు వివరించారు. మెదక్, రేగోడ్, పెద్ద శంకరంపేట, అల్లాదుర్గం, టేక్మాల్, పాపన్నపేట, హవేళీఘనపూర్, చిన్న శంకరంపేట, నిజాంపేట, రామాయంపేట మండలాల్లో ఈ నెల 9 నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఆర్వో, ఏఆర్వోలకు శిక్షణ ఇచ్చామన్నారు. ఇప్పటికే ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలను నియమించినట్లు తెలిపారు.

అమ్మవారి శోభాయాత్ర

జహీరాబాద్ పట్టణంలోని డీసీఎంఎస్ కాంప్లెక్స్ వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారిని పౌర్ణమి పూజల అనంతరం బుధవారం నిమజ్జనానికి తరలించారు. శోభాయాత్రంలో భవానీ దీక్షా మండలి, ఎక్కెల్లి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ ఊరేగింపులో పలువురు నాయకులు పాల్గొన్నారు.

- జహీరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి)



విద్యార్థులు ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయాలి

- సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య



ఏటీసీలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. సంగారెడ్డిలోని ఐటీఐ ప్రాంగణంలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ని బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఏటీసీలో కొనసాగుతున్న బోధన విధానం, విద్యార్థులకు అందిస్తున్న సాంకేతిక శిక్షణను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి కాలంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన వారికే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

రెండో విడత పాఠ్యపుస్తకాల సరఫరా

- మండల పాయింట్లకు చేరవేస్తున్న అధికారులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం రెండో విడత(పార్ట్-2) పాఠ్యపుస్తకాలు మండల పాయింట్లకు సరఫరా చేసేందుకు అధికారులు అవసరమైన చర్యలు ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లాకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో మొదటి విడత పాఠ్యపుస్తకాలు 2,49,800 అవసరం కాగా, ఇప్పటి వరకు 2,03,020 పాఠ్యపుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. దీంతో బుధవారం నుంచి మండల పాయింట్లకు సరఫరా ప్రారంభించారు. జూన్ నెలలోనే విద్యాశాఖ జిల్లాలోని అన్ని సర్కారు బడులకు మొదటి విడత పాఠ్యపుస్తకాలు సరఫరా చేసిన విషయం తెలిసిందే.

సామాన్యులపై భారం సంపన్నులపై మమకారం

కంది పంచాయతీలో ఇంటి పన్ను దోపిడీ!

వందకుపైగా రికార్డుల్లో ఎక్కని ఇళ్లు

లీడర్లు, అధికారుల కుమ్మక్కుతో ఆదాయానికి గండి

కంది, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కంది మేజర్ గ్రామపంచాయతీలో ఇంటి పన్నుల వసూళ్లలో అవినీతి రాజ్యమేలుతుంది. కొన్నేళ్లుగా పంచాయతీ అధికారులు, సిబ్బంది సంపన్నులు, స్థానిక బడా నాయకులకు నామమాత్రపు పన్నులు విధించి, సామాన్య, మధ్యతరగతిపై మోయలేని భారం వేస్తున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. అధికారుల చేతివాటంతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది.

రికార్డుల్లో ఎక్కించకుండా..

కంది గ్రామపంచాయతీలో దాదాపు 3 వేలకు పైగా ఇళ్లు ఉన్నాయి. మేజర్ పంచాయతీలో రూ.43 లక్షల పన్ను వసూళ్లకే పరిమితమైంది. అధికారులు, సిబ్బంది కొందరు నాయకులతో కుమ్మక్కై, సుమారు 400 నుంచి 600 గజాల స్థలాల్లో నిర్మించిన జీ+2, జీ+3 ఫ్లోర్లు ఉన్న పెద్ద భవనాలకు ఏళ్ల తరబడి పన్నుల క్రమబద్ధీకరణ (అసెస్‌మెంట్) చేయకుండా వదిలేశారు. దీంతో వీరు కేవలం రూ.100 నుంచి రూ.500లోపే ఇంటిపన్ను చెల్లిస్తున్నారు. అదే సమయంలో, సామాన్యులకు మాత్రం పన్నులు రూ.6వేలకు పైగా విధిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాక, గ్రామంలో దాదాపు 100కు పైగా కొత్త ఇళ్లను పంచాయతీ రికార్డుల్లో, ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా వదిలేసినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కొంతమంది చెల్లించే పన్నుకు రశీదులు కూడా లేవని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఇళ్ల యజమానుల వద్ద వసూళ్లకు పాల్పడి పంచాయతీ అధికారులు, సిబ్బంది తమ జేబులు నింపుకుంటున్నారనే బహిరంగంగా వినిపిస్తున్నాయి. 30 ఏళ్లుగా ఈ పన్ను దోపిడీ కొనసాగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. లీడర్లకో న్యాయం, సామాన్యులకో న్యాయమా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.



ఇంటి కొలతలు తీసుకుంటున్న సిబ్బంది (ఫైల్)

తూతూమంత్రంగా ఆడిట్

ప్రతి ఏటా తప్పనిసరిగా నిర్వహించాల్సిన ఆడిట్ తనిఖీలు కూడా ఇక్కడ తూతూ మంత్రంగానే జరుగుతున్నాయి. పన్ను వసూళ్లు సక్రమంగా ఉన్నాయా, రికార్డుల్లో లోపాలు ఉన్నాయా అనే విషయాలపై ఆడిట్ అధికారులు దృష్టి సారించకుండా, కేవలం తమ స్వలాభం చూసుకోవడం వల్లే ఇన్నేళ్లుగా ఈ అవినీతి నిరాటంకంగా కొనసాగుతోందని స్పష్టమవుతోంది. ఈ పన్ను అవకతవకలు గ్రామస్థులు పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమాన పన్నులు ఉండేలా చూస్తాం



కంది గ్రామంలో కొందరికి ఇంటి పన్ను కొన్నేళ్లుగా తక్కువగా ఉన్న మాట మా దృష్టికి వచ్చింది. వెంటనే విచారణ జరిపించి, హౌస్ యాక్ట్ ప్రకారమే కొలతలు తీసుకుని అందరికీ సమాన పన్నుల రేటు అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం. రికార్డుల్లో లేని ఇళ్లను వెంటనే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయిస్తాం.

-మహేందర్‌రెడ్డి,
మండల పంచాయతీ అధికారి

ఇందిరమ్మ ఇళ్లకు ధరాఘాతం

లబ్ధిదారులపై అదనపు భారం.. అప్పు చేసి నిర్మాణం

7

నర్సాపూర్‌కు నీటి గోస

పైప్‌లైన్ లీకేజీతో494 గ్రామాలకు నిలిచిన సరఫరా

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



నార్సింగిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట/రేగోడు/నర్సాపూర్/చిలప్‌చెడ్/తూప్రాన్/చేగుంట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో బుధవారం పలు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. పెద్దశంకరంపేట మండలంలోని గొట్టి ముక్కుల, బూర్గుపల్లి, శివాయిపల్లి గ్రామాల్లో కేంద్రాల ప్రారంభంలో ఐకేపీ సీసీలు వీరాచారి, స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు. రేగోడు మండలంలోని కొత్వాల్‌పల్లి, చౌదరిపల్లి, రేగోడు గ్రామాల్లో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు తహసీల్దార్ దత్తారెడ్డి ప్రారంభించారు. వట్‌పల్లి మార్కెట్ కమిటీ ట్రేడ్ డైరెక్టర్ శ్రీధర్‌గుప్తా, మండల వ్యవసాయ అధికారి జావిద్, ఏపీఎస్ సాయిలు, ఐకేపీ సిబ్బంది పాన్నారు. నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి, మంతూరు, ఖాజీపేట, తుజాల్‌పూర్, బ్రాహ్మణపల్లి, రామచంద్రాపురం, తుల్జారాంపేట, గూడెంగడ్డ, మహ్మదాబాద్, మూసాపేట, చింతకుంట గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు ఏపీఎం సంగమేశ్వర్ తెలిపారు. చిలప్‌చెడ్ మండలంలోని శిలాంపల్లి, జగ్గంపేట, గంగారం, సోమ్లతండా, రాందాస్‌గూడ, చండూరు, చిట్కుల్ గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభించినట్లు ఐకేపీ ఏపీఎం గౌరిశంకర్ పేర్కొన్నారు. తూప్రాన్ మండలంలో ఇందిరా క్రాంతి పథం (డీఆర్‌డీఏ - ఐకేపీ) వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రారంభించారు. మండలంలోని మల్కాపూర్, గుండ్రెడ్డిపల్లి, ఇస్లాంపూర్, యవాపూర్, వట్టూరు, వెంకటాయపల్లి గ్రామాల్లో ప్రారంభోత్సవంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. చేగుంట మండలంలో మండలంలోని రాంపూర్, ఇబ్రహీంపూర్, అనంతసాగర్, కర్నాల్‌పల్లి, రుక్మాపూర్, గొల్లపల్లి, కసాన్‌పల్లి, పోతాన్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను తహసీల్దార్ శివప్రసాద్ ఎంపీడీవో చిన్నారెడ్డితో కలిసి ప్రారంభించారు. నార్సింగ్‌లోలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎంపీడీవో ఆనంద్, ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో బాంబు స్క్వాడ్ తనిఖీ

తూప్రాన్ అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధిలోని బస్టాండ్‌లో బాంబ్ స్క్వాడ్ నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా బస్ స్టేషన్, దాబాలు, హోటళ్లు, పాన్ షాపులులో తనిఖీలు చేపట్టారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు గమనించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలు పరిరక్షణ కోసం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని ఎస్పీగారు తెలిపారన్నారు. ఇందులో తూప్రాన్ ఎస్ఐ జ్యోతి, ఏఎస్ఐ శ్రీనివాస్, డాగ్ స్క్వాడ్ శ్రావణ్, సిద్దిరాములు సిబ్బంది పాల్గొన్నారు.



తూప్రాన్ బస్ స్టేషన్‌లో బాంబ్ స్క్వాడ్ తనిఖీ చేస్తున్న పోలీసులు



కుమారులతో కలిసి భర్తను చంపిన భార్య

కుకునూరుపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రోజూ మద్యం తాగి వచ్చి గొడవ పడుతున్నాడని ఇద్దరు మైనర్ కుమారులు.. మరో ముగ్గురితో కలిసి కొట్టి.. బతికి ఉండగానే కాళ్ల చేతులు కట్టేసి.. నీళ్లలో బయటకి తేలకుండా నడుముకు బండరాయి కట్టి వాగులో పడేసింది ఓ భార్య. తర్వాత ఏం జరగనట్లు రోజువారీ పనులు చేసుకుంది. రెండు రోజుల తర్వాత వాగులోంచి మృతదేహం తేలడంతో గ్రామస్థులు చూసి ఫిర్యాదు చేయగా, రంగంలోకి దిగిన పోలీసులు హత్య కేసును ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గజ్వేల్ ఏసీపీ తోట నర్సింహులు, సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్ వివరించారు. మండలంలోని తిప్పారం గ్రామానికి చెందిన సింధు సంతోషికి కరీంనగర్ జిల్లాకు చెందిన మహేందర్‌తో వివాహం జరిగింది.

భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో సంతోషి ఇద్దరు పిల్లలను తీసుకుని తిప్పారం గ్రామానికి వచ్చి ఉంటోంది. నెల రోజుల క్రితం గ్రామానికి వచ్చిన మహేందర్ భార్యాపిల్లలతోనే ఉంటున్నాడు. అయితే, రోజూ మద్యం తాగి వచ్చి, గొడవ పడుతున్నాడు. శనివారం రాత్రి మహేందర్ భార్యాపిల్లలతో గొడవ పెట్టుకున్నాడు. ఈ క్రమంలో మైనర్ అయిన అతడి పెద్ద కుమారుడు మహేందర్ తలపై కర్రతో కొట్టగా, కింద పడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత లేచి బయటకు వెళ్లాడు. సాయంత్రం మళ్లీ తాగి వచ్చి గొడవ పడ్డాడు. మద్యం మత్తులో స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో సంతోషి తన ఇద్దరు మైనర్ కుమారులతో పాటు తన బంధువులు అయిన అదే గ్రామానికి చెందిన మరో ముగ్గురి సహాయంతో మత్తులో ఉన్న భర్తను ఆటోలో కూడవెల్లి వాగు వద్దకు తీసుకెళ్లింది. అక్కడ కాళ్ల చేతులు కట్టేసి, నదిలో నుంచి బయటకు రాకుండా నడుముకు తాడుతో బండరాయి కట్టి బతికుండగానే నదిలో పడేశారు.

ఇదంతా శనివారం రాత్రి జరగగా, ఏం జరగనట్లు ఇంటికి వచ్చి ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. అయితే, సోమవారం సాయంత్రం కూడవెల్లి వాగులో ఓ మృతదేహం నీటిపై తేలుతూ కనిపించగా, గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడిని మహేందర్‌గా గుర్తించి, అతడి భార్యాపిల్లలు, బంధువులను అదుపులోకి తీసుకుని విచారించగా, జరిగిన విషయాన్ని చెప్పారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హత్యచేసినట్లు భావిస్తున్నారు.

మిస్టరీగా గురుకుల విద్యార్థి మృతి

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలోని సాంఘీక సంక్షేమశాఖ బాలుర గురుకులంలో ఎనిమిదవ తరగతి విద్యార్థి సనాదుల వివేక్ (13) మృతి ఇంకా మిస్టరీగానే మిగిలింది. మంగళవారం ఉదయం డ్రిల్‌పీరియడ్‌లో హాస్టల్ కారిడార్‌లో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు మెడకు తాడు చుట్టుకుని వివేక్ మృతి చెందినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలుపారు. తమ కుమారుడి మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని మృతుడు వివేక్ తల్లితండ్రులు సనాదుల సత్యనారాయణ-లావణ్య బంధువులు ఆరోపించారు. మొదటి రోజు బంధువుల ఆందోళనలు రాత్రోరేకోతో పోస్టుమార్టం జరగ లేదు. రాత్రాంతా పోలీసుల పహారాలో వివేక్ మృతదేహం పోస్టుమార్టం గదిలోనే నిలిచిపోయింది. బుధవారం ఉదయం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పోస్టుమార్టం గది వద్దకు వచ్చి విద్యార్థి వివేక్ తల్లితండ్రులను ఓదార్చారు. గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే విద్యార్థి మృతికి కారణమని వారిపై కేసుమోదు చేసి న్యాయవిచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో మధ్యాహ్నం వరకు కూడా వివేక్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించలేదు. సీఐ శ్రీనివాస్, ఎస్ లక్ష్మారెడ్డి వివేక్ తల్లితండ్రులతో మాట్లాడి విద్యార్థి మృతిపై నిస్పక్షపాతంగా విచారణ చేపడతామని మీకు అనుమానం ఉన్న వారిపై దరఖాస్తు ఇస్తే పోస్టుమార్టం అనంతరం వచ్చిన రిపోర్టు ఆధారంగా నిందుతులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు. దీంతో వివేక్ తల్లితండ్రులు తన కుమారుడిని ఆసుపత్రికి తీసుకు వచ్చిన ఉపాధ్యాయులతో పాటు పాఠశాలలో ఉన్న విద్యార్థులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల పై కేసునమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివేక్ తల్లితండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతి కింద కేసునమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థి మృతిచెందిన 24 గంటల అనంతరం వివేక్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం విద్యార్థి మృతదేహాన్ని సిద్దిపేట ఆసుపత్రి నుంచి తెప్పించి పార్థీవ వాహనంలో వివేక్ స్వగ్రామం నంగునూర్‌కు తరలించారు.

నంగనూర్‌లో పాఠశాలలు బంద్

నంగునూరు, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లెల్లగడ్డ గురుకుల పాఠశాలలో అనుమానస్పద స్థితిలో మృతి చెందిన విద్యార్థి సనాదుల వివేక్ (13) అంత్యక్రియలు నంగునూరులో బుధవారం ముగిశాయి. హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహం గ్రామానికి చేరుకోగానే స్థానిక నాయకులు, యువకులు, విద్యార్థులు వివేక్ మృతదేహానికి నివాళులర్పించారు. తల్లి లావణ్య, తండ్రి సత్యనారాయణను ఓదార్చి అంత్యక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి కుటుంబానికి సంఘీభావం తెలుపుతూ సంగునూరు లోని ఉన్నత ప్రాథమిక పాఠశాల. అక్కెనపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. వివేక్ మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

కారులో లిఫ్టు ఇచ్చారు..

●బెదిరించి డబ్బులు లాక్కున్నారు

నర్సాపూర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కారులో లిఫ్టు ఇచ్చారు కదా అని ఎక్కిన వారిని మధ్యలో కారులోనే బెదిరించి వారిపై దాడి చేశారు. వారి వద్ద ఉన్న డబ్బులతో పాటు ఫోన్ పే ద్వారా అకౌంట్‌లో ఉన్న వాటిని కూడా వేయించుకుని మధ్యలోనే దింపేసి ఉడాయించిన ఘటన నర్సాపూర్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం సాయంత్రం ఎస్సై రంజిత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లాకు చెందిన దామరగిద్దకు చెందిన గొర్లకాపరులు నర్సింహా, బాలప్ప గొర్రెలు మేపుకుంటూ నర్సాపూర్‌కు మంగళవారం సాయంత్రం వచ్చారు. ఓ రైసుమిల్లు వద్ద తమ గొర్రెలను ఉంచి గొర్రెలకు అవసరమైన వాటిని కొనుగోలు చేద్దామని మెదక్ వెళ్లడానికి నర్సాపూర్ ప్రధాన చౌరస్తా వద్దకు వచ్చారు. అదే సమయంలో సంగారెడ్డి నుంచి బ్లాకలర్ కార్‌లో వచ్చిన వారు నిలబడ్డ వీరిని ఎక్కడకు వెళ్లాలని అడగ్గా మెదక్ అని చెప్పగా మేము అక్కడికే వెలుతున్నామని ఎక్కండి అని ఎక్కించుకున్నారు. అయితే కారులో వెళ్తున్న క్రమంలో కారులో వచ్చిన వారు ఎక్కిన ఇద్దరిని మీ వద్ద ఉన్న డబ్బు ఇవ్వండి లేకుంటే చంపుతామంటూ కొట్టడం చేశారు. దీంతో భయపడి నర్సింహా వద్ద ఉన్న ఐదువందలు ఇవ్వగా అతడి ఫోన్ లాగుకుని ఫోన్‌పే అకౌంట్ ద్వారా తమ అకౌంట్‌లో ఉన్న వేయి రూపాయలు కూడా వేయించుకున్నారు. బాలప్ప వద్ద ఉన్న ఫోన్‌ను కూడా తీసుకుని అదేవిధంగా ఫోన్‌పే ద్వారా అకౌంట్‌లో ఉన్న రూ.4500లు వారి అకౌంట్‌లో వేయించుకుని కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేట సమీపంలో వదిలేసి ఉడాయించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదే కారులో వచ్చిన వారు నర్సాపూర్-సంగారెడ్డి మార్గంలో కూడా ఓ స్కూటీపై వచ్చిన వ్యక్తిని కూడా బెదిరించి అతడి వద్ద నుంచి కూడా డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది.

పాడి గేదెల మృతిపై అధికారుల విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నారాయణఖేడ్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఇరవై పాడి గేదేల మృతి సకాలంలో వ్యాక్సినేషన్ చేయక పోవడంతో అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈనెల 6న ప్రచురితమైన వార్త కథనానికి స్పందించిన పశు సంవర్ధక శాఖ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. సంగారెడ్డి ఏడీ పవన్‌కుమార్, నారాయణఖేడ్ ఏడీ గంగాధర్, పశువైద్యాధికారి గ్రామంలో పాడి గేదేలు, పశువుల రక్తపు నమోనాలు సేకరించారు.







బాలుడి కిడ్నాప్ కలకలం



పవన్ (ఫైల్)

జోగిపేట రూరల్, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): బాలుడి కిడ్నాప్ స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటన అందోల్ మండల పరిధిలోని తాడ్మనూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై పాండు తెలిపిన వివరాలు... కర్నాటకు చెందిన బాలుడి తల్లి భర్తతో గొడవ పడి తన సోదరుడైన మరాఠా రాజు వద్ద ఉంటోంది. ఆమెకు పవన్ అనే కుమారుడు ఉన్నాడు. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో గుర్తుతెలియని ఇద్దరు దుండగులు ద్విచక్ర వాహనంపై వచ్చి బాలుడిని ఎత్తుకెళ్లి నట్లు మరఠా రాజు జోగిపేట పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై పాండు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తునట్లు తెలిపారు.

మద్యం తాగించలేదని వ్యక్తిపై దాడి

కుకునూరుపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):తమకు మద్యం తాగిపించలేదని ఓ వ్యక్తిపై ఇద్దరు యువకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. లకుడారం గ్రామానికి చెందిన ఈగ రాజు సోమవారం రాత్రి నడుచుకుంటూ తన ఇంటికి వెళ్తుండగా మార్గం మధ్యలో అదే గ్రామానికి చెందిన బైండ్ల వినయ్, రాచకొండ మధు ఇద్దరి యువకులు తమకు మద్యం తాగిపించాలని అతనిని బెదిరించారు. రాజు ఈరోజు నా వద్ద డబ్బులు లేవని రేపు తాగిపిస్తానని నచ్చజెప్పి ప్రయత్నం చేశాడు. దీంతో ఆగ్రహించిన ఇద్దరు యువకులు రాజుని విచక్షణారహితంగా అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. భయంతో తీవ్ర గాయాలతో కుటుంబ సభ్యులకు విషయం చెప్పకుండా మంగళవారం మధ్యాహ్నం వరకు నిద్రిస్తూ ఉండడంతో కుటుంబ సభ్యులు గమనించి ఏమైందని ఆరా తీయడంతో జరిగిన విషయం చెప్పాడు. దీంతో వారు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయడంతో ఇద్దరి యువకులపై కేసు నమోదు అయిందని దాడికి పాల్పడ్డ యువకులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉంటే దాడి చేసిన ఇద్దరు యువకులు గతంలో గ్రామంలోనే కాకుండా ఇతర గ్రామాలలో పలు నేరాలకు పాల్పడి నిందితులుగా ఉన్నారు. మరో మారు వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో గ్రామ యువకులు, ప్రజలు మంగళవారం రాత్రి యువకుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆందోళన చేసి రాచకొండ మధును చితక బాదారు. బుధవారం ఉదయం గ్రామస్థులందరూ పోలీస్ స్టేషన్ కి వచ్చి ఇద్దరి యువకులను కఠినంగా శిక్షించాలని ఫిర్యాదు చేశారు.

బెల్ట్ షాప్‌లో టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడి

మనోహరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా బెల్ట్‌షాప్‌లో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి చేసి మద్యం పట్టుకున్న ఘటన మండల పరిదిలో చోటు చేసుకుంది. మనోహరాబాద్ మండల పరిదిలోని కాళ్లకల్ గ్రామంలోని ప్రభాకర్ గౌడ్‌కు చెందిన బెల్ట్ షాపులో జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు మెదక్ జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు బెల్ట్ షాప్‌పై దాడి చేశారు. దీంతో బెల్ట్ షాప్‌లో సుమారు 150 లీటర్ల వరకు మద్యాన్ని పట్టుకున్నారు. స్వాధీనం చేసిన మద్యాన్ని, నిందితుడిని మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

పాఠశాలలో విద్యుత్ వైర్ల చోరీ

మనూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మనూరు మండలం రాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొందరు ఆకతాయిలు మంగళవారం రాత్రి విద్యుత్ వైర్లు చోరీ చేయడమే కాకుండా, ఫ్యాన్లు ధ్వంసం చేసి, నీళ్ల తాగే కుళాయిలను ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామస్థులు బుధవారం మనూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు పాఠశాలను తనిఖీ చేసి విచారణ జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గతంలో కూడా పాఠశాల ఆవరణలో మందు తాగి సీసాలను పగుల గొట్టి పాఠశాలలో అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు.

బ్యాగును తిరిగి అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది

హుస్నాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో ఓ మహిళ మరచిపోయిన బ్యాగును తిరిగి అప్పగించి డ్రైవర్, కండక్టర్ శబాష్ అనిపించుకున్నారు. బుధవారం సిద్దిపేట డిపోకు చెందిన బస్సు ఎక్కిన శోభారాణి నాలుగు తులాల బంగారు గొలుసు, బట్టలతో కూడిన బ్యాగును బస్సులోనే మరచిపోయి హనుమకొండలో దిగింది. బస్సులో బ్యాగు మరచిపోవడాన్ని గమనించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే వారు ఫోన్ ద్వారా ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించి బస్సు వివరాలను తెలుసుకున్నారు. బస్సు డ్రైవర్ మల్లయ్య, కండక్టర్ శంకర్‌లకు విషయం తెలిపి బ్యాగును హుస్నాబాద్ బస్టాండ్‌లో స్వాధీనం చేసుకొని మహిళకు తిరిగి అప్పగించారు. విలువైన బ్యాగును అందించినందుకు మహిళా ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నిజాంపేట, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): కూలి పనులకు వెళ్తున్న ఓ యువకుడిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఈ విషాద ఘటన జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రానికి చెందిన కొమ్మాట ఎల్లం (28) కొద్ది రోజులుగా మేడ్చల్ ప్రాంతంలో కూలి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. పనికి వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి నిజాంపేట పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు.

బైక్ దొంగ..

మనోహరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బైక్ దొంగతానికి వచ్చిన వ్యక్తిపై పెట్రోల్ పోయడంతో తీవ్ర గాయాలు కాగా ఐదు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న చిన్న శంకరంపేట మండలం జంగారాయి గ్రామానికి చెందిన మోహన్, మైపాల్ బైక్ దొంగతనానికి చేగుంట మండలం వడియారం వచ్చారు. దీంతో గ్రామస్థులు పట్టుకుని పెట్రోలు ఒంటిపై పోసి అంటించడంతో తీవ్ర గాయాలయ్యాయి. బండెల మోహన్ అలియాస్ (హేవాన్)(32) వేంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీంతో 5 రోజుల తరువాత చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.

ఇంటికి వెళ్లేందుకు దారి ఇవ్వడం లేదని..


●పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

హవేళిఘణపూర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఇంటికి వెళ్లేందుకు దారి ఇవ్వడంలేదని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని వాడి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటంబీకులు, పోలీసుల కథనం ప్రకారం.. వాడి గ్రామానికి చెందిన గుడుపల్లి సుభాష్ రెడ్డి (44) వ్యవసాయం చేస్తుంటాడు. సుభాష్ తన ఇంటికి వెళ్లేందుకు దారి లేదని తీవ్ర మనోవేదనకు గురై ఈ నెల 3న తమ పౌల్ట్రీ ఫాం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అంతకు ముందు తనకు జరిగిన అన్యాయం గురించి వాయిస్ రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ రికార్డులో తన ఇంటికి వెళ్లడానికి దారి గొడవ జరుగుతుందని దీని గురించి గ్రామస్థులకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేదని నా చావుతో నైనా నాఇంటికి దారి ఇవ్వాలని పేర్కొన్నారు. దీన్ని చూసిన సన్నిహితులు బాధితుడిని హాస్పిటల్‌కు తరిలించారు. హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌లో నాలుగు రోజుల పాటు చికిత్సపొందుతూ మరణించాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎసై నరేష్ తెలిపారు. దారికి ఇవ్వకపోవడం వల్లే సుభాష్ రెడ్డి మృతి చెందాడని ఆగ్రహించిన గ్రామస్థులు, బంధువులు మహేందర్ ఇంటికి దారిని ఏర్పాటు చేశారు.

అప్పుల బాధతో వ్యక్తి ..

హుస్నాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన జొన్నగడ్ల నర్సయ్య (44) అప్పుల బాధ భరించలేక బుధవారం సాయంత్రం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కూలి పని చేసుకొని జీవించే నర్సయ్య ఇటీవల కొత్త ఇంటిని నిర్మించుకున్నాడు. ఇందుకు రూ. 8 నుంచి 10 లక్షల వరకు ప్రైవేట్ ఫైనాన్స్‌లు, పలువురు వద్ద అప్పులు చేశారు. ఎకరం వ్యవసాయ భూమి ఉండగా అందులో ఆశించిన మేర పంట రాలేదు. దీంతో అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.

గృహిణి అదృశ్యం



ద్రతి మంజి (ఫైల్)

పటాన్‌చెరు అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గృహిణి అదృశ్యం అయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్ జిల్లా రాంజీ గ్రామానికి చెందిన అతుల్‌చోక్స్, ద్రతిమంజిలు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ప్రైవేట్ పరిశ్రమలో అతుల్‌చోక్స్ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఈనెల 4న డ్యూటీకి వెళ్లాడు. మధ్యాహ్నం తను ఇంటి నుంచి వెళ్లిపోతున్నానంటూ భార్య ద్రతిమంజి భర్తకు ఫోన్ చేసి చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. చుట్టుపక్కల విచారించినా ఫలితం లేకపోవడంతో అతుల్‌చోక్స్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ధరాఘాతం



లబ్ధిదారులపై అదనపు భారం.. అప్పు చేసి నిర్మాణం

- వేధిస్తున్న ఇసుక కొరత.. ధర పెంపు
- ఇటుక, సిమెంట్, కంకర ప్రియమే..
- ప్రభుత్వమిచ్చే రూ.5లక్షలు సరిపోని వైనం
- రూ.3 నుంచి 5 లక్షలు అదనంగా వ్యయం
- అప్పులపాలవుతున్న లబ్ధిదారులు

రఘురాసంగం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకానికి మార్కెట్ ధరలు, వర్షాల రూపంలో గట్టి ఎదురుదెబ్బ తగులుతోంది. ఇంటి నిర్మాణానికి అత్యంత కీలకం అయిన ఇసుక ధరలు అమాంతం రెండింతలు పెరగడంతో లబ్ధిదారులపై నిర్మాణ భారం భారీగా పడింది. ఫలితంగా ఇళ్ల నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. మండలంలో మొత్తం 583 ఇందిరమ్మ ఇళ్లు మంజూరవగా, ఇప్పటివరకు 383 ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయి. ఇందులో 230 బేస్‌మెంట్ స్థాయిలో, 50 రూఫ్ లెవెల్‌లో, 19 స్లాబ్ వరకు పూర్తయ్యాయి. అయితే, మార్కెట్‌లో ఇసుక, కంకర, మేస్త్రీల కూలి ధరలు అధికం కావడంతో ప్రభుత్వం ఇస్తున్న రూ.5లక్షలు ఏమాత్రం సరిపోవడం లేదని, అదనపు వ్యయం కోసం వడ్డీలకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బర్డీపూర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులు

ఇసుక కొరతతో పనులకు ఆటంకం

ఇంటి నిర్మాణం సజావుగా సాగాలంటే ఇసుక అత్యవసరం. ప్రస్తుత వర్షాల కారణంగా ఇసుక మార్కెట్‌లో తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో వ్యాపారులు ధరలను ఇష్టానుసారంగా పెంచేశారు. గతంలో లారీ ఇసుక (30-40 టన్నులు) రూ.40 వేల నుంచి రూ.45 వేలలో ఇంటి వద్దకు సరఫరా అయ్యేది. కానీ, ప్రస్తుతం వర్షాల కారణంగా టన్ను ఇసుక ధర రూ.2,100 నుంచి రూ.2,500 వరకు పలుకుతోంది. దీంతో లారీ ఇసుక కోసం లబ్ధిదారులు సుమారు రూ.లక్ష వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టలేక చాలా మంది లబ్ధిదారులు నిర్మాణ పనులను నెమ్మదిగా చేపట్టారు.

ఇతర సామగ్రి ధరలూ అధికమే

ఇసుకతో పాటు ఇతర నిర్మాణ సామగ్రి ధరలు కూడా పెరిగాయి. 100 ఫీట్ల కంకర ట్రాక్టర్ గతంలో రూ.3,500 ఉండగా, ఇప్పుడు రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. మేస్త్రీల కూలి ధరలు కూడా గణనీయంగా పెరగడంతో కేవలం కూలీలకు, మేస్త్రీలకే సుమారు రూ.2.60 లక్షలు ఖర్చవుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

అప్పు చేసి ఇల్లు కట్టుకుంటున్న పేదలు

లబ్ధిదారుల్లో అత్యధికులు పేద, మధ్య తరగతి ప్రజలే. 400 నుంచి 600 చదరపు అడుగుల్లోనే ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవాలనే నిబంధన ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలతో ఇల్లు పూర్తి కావడం లేదు. సామాగ్రి ధరల పెరుగుదల కారణంగా లబ్ధిదారులు అదనంగా రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వ్యయం చేయాల్సి వస్తోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు చేసి ఇంటి నిర్మాణాలు కొనసాగిస్తున్నారు.

అధికారులు ఏమంటున్నారంటే..

ప్రభుత్వం ఇస్తున్న రూ.5 లక్షలు నివసించేందుకు సరిపడా ఇంటి నిర్మాణంకు సరిపోతాయని అధికారులు సూచిస్తున్నారు. అదనపు వసతుల పేరుతో లబ్ధిదారులు అప్పులపాలు కావద్దని వారు హితవు పలుకుతున్నారు. అయితే, లబ్ధిదారులు మాత్రం ప్రభుత్వ ఇసుక సరఫరా చేస్తామని చెప్పినా ఇప్పటివరకు రాలేదని, కేవలం బేస్‌మెంట్ బిల్లు మాత్రమే వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండింతలు ఖర్చు అవుతుంది...



ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక, కంకర, సిమెంట్ ధరలు మార్కెట్‌లో బాగా పెరిగాయి. దీంతో నిర్మాణానికి రెండింతలు ఖర్చు అవుతోంది. ఇసుక ధర రెండింతలు పెరిగింది. ప్రభుత్వం ఇస్తామని చెప్పిన ఇసుక ఇప్పటికీ రాలేదు. ఇప్పటివరకు మాకు బేస్‌మెంట్ బిల్లు మాత్రమే వచ్చింది.

- వెంకన్న,లబ్ధిదారుడు, బర్డీపూర్

'సింగూరు'కు ఆగని వరద

- ఇన్ ఫ్లో 30,410.. ఔట్ ఫ్లో 38,610 క్యూసెక్కులు
- నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

పుల్‌కల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు ఎగువన కర్ణాటక, మహారాష్ట్రతో పాటు జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు వరద ప్రవాహం వచ్చి చేరుతూనే ఉన్నది. దాదాపు రెండు నెలలుగా వరద పోటెత్తుతూనే ఉన్నది. ఎగువ నుంచి వరద ప్రవాహం ఏ మాత్రం తగ్గడం లేదు. నాలుగు రోజుల క్రితం వరద తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరిగింది. దీంతో నాలుగు క్రస్ట్ గేట్లను ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువకు వదులుతున్నారు. ఈ గేట్ల ద్వారా 35,750 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ గుండా 2,200, ఎడమ కాలువకు 120, హెచ్ఎండబ్ల్యూఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70, ఆవిరి అవుతున్నది 390 , మొత్తం ఔట్ ఫ్లో 38,610 క్యూసెక్కులు నమోదయింది. బుధవారం రాత్రి అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులో 520.875 మీటర్లకు 17.791 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. సింగూరు ప్రాజెక్టు నుంచి వరద ప్రవాహం అధికంగా ఉండటంతో దిగువన ఉన్న మంజీర జలాశయం మూడు క్రస్ట్ గేట్లను ఐదు మీటర్లు ఎత్తారు. వచ్చిన నీటిని వచ్చినట్లుగానే దిగువన ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.

ఆర్టీసీ దసరా వేడుకల లక్కీ డ్రా

- విజేతలకు నగదు బహుమతుల ప్రదానం



లక్కీ డ్రా తీస్తున్న సీఐ రమేశ్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో బుధవారం దసరా వేడుకల లక్కీ డ్రా నిర్వహించారు. దసరా సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికుల టికెట్‌లను గత నెల 27వ తేదీ నుంచి ఈ నెల 6వ తేదీ వరకు ఆయా బస్‌స్టేషన్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో వేసిన విషయం తెలిసిందే. పట్టణ సీఐ రమేశ్ హాజరై ఆ టికెట్‌లకు సంబంధించి లక్కీ డ్రాను ఓపెన్ చేశారు. ఇందులో విజేతలుగా నిలిచిన హైదరాబాద్‌కు చెందిన రాజేశ్వరికి ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా హైదరాబాద్‌కు చెందిన సర్వత సయ్యద్‌కు రూ.15 వేల నగదు, తృతీయ బహుమతిగా పటాన్‌చెరుకు చెందిన గంగిశెట్టి కోటేశ్వరరావుకు రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్‌వీజీ కృష్ణమూర్తి, సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్, పీవో అనిత, ఎంఎఫ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇద్దరికి ఇందిరమ్మ ఇళ్లు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దుబ్బాక, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు కూలిపోయే స్థితిలో ఉన్నా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయకపోవడంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. దుబ్బాక మండలం పద్మశాలి గడ్డ గ్రామంలోని చెరుకు ప్రవీణ, చెరుకు పద్మ కూలిపోతున్న ఇండ్లలో టార్పాలిన్ కాగితాలు కప్పుకుని బిక్కుబిక్కుమంటూ నివాసముంటున్నారు. వీరికి అత్యవసర జాబితాలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని గ్రామస్థులు, నాయకులు ప్రతిపాదించినా జిల్లా అధికారులు కనికరించలేదు. ఈ విషయమై బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఇందిరమ్మా- ఇదేనా న్యాయం?' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఈ కథనాన్ని కలెక్టర్ హైమావతి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పదిహేను రోజుల్లో రెండవ జాబితాలో అత్యవసర ప్రాధాన్యత కింద వారికి ఇళ్లు మంజూరు చేయనున్నట్టు కలెక్టర్ హామీనిచ్చారని ఆయన తెలిపారు. వారం రోజుల్లో మరో ఏడుగురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని, వారితో పాటు వీరిద్దరి పేర్లను కూడా మంజూరు జాబితాలో చేర్చుతామని చెప్పినట్లు తెలిపారు.

ఎన్నికల విధుల్లో సమయపాలన కీలకం

- సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి టౌన్/నాగల్‌గిద్ద/మనూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది సమయపాలన పాటించడం కీలకమని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల స్టేజ్-1 రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ల ప్రక్రియపై బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా నాగల్‌గిద్ద, మనూరు ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియలో సిబ్బంది సమయపాలన కీలకమైన అంశంగా పరిగణించాలన్నారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియకు తగిన ఏర్పాట్ల పరిశీలన, పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయడం, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ రోజున జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం రిటర్నింగ్ అధికారుల విధిగా పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ కృష్ణ నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉప సంహరణ, బ్యాలెట్ పేపర్ల తయారీ తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులకు అవగాహన కల్పించారు. డీపీవో సాయిబాబా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, తహసీల్దార్ శివకృష్ణ, ఎంపీడీవోలు మహేశ్వర్‌రావు, చంద్రశేఖర్, ఏవో మహేష్ చౌహాన్, ఎంపీవో హైమద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఐడీఎస్ఎంటీ బాధితులను ఆదుకోవాలి

- జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాములునేత



మున్సిపల్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు, నాయకులు

జహీరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో వివాదాస్పదంగా మారిన ఐడీఎస్ఎంటీ ప్లాట్ల బాధితులను ఆదుకోవాలని జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాములునేత పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, నాయకుల తప్పిదాలవల్లే ప్లాట్లను కొనుగోలు చేసిన బాధితులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఐడీఎస్ఎంటీలో కొంతభాగం ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా అధికారులు గుర్తించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. దశాబ్దాల క్రితం అధికారులు, నాయకులు కలిసి ప్రజలవద్ద కొంత నగదును తీసుకుని రిజిస్ట్రేషన్లు చేసి ప్లాట్లను కేటాయించడం ఎంతవరకు కరెక్ట్ అన్నారు. అధికారులకు, నాయకులకు భూమి ప్రభుత్వానిదేనని స్పష్టమైన వివరాలు తెలిశాకే ప్రజలకు విక్రయిస్తే బాగుండేదన్నారు. ప్రభుత్వం అవకాశం కల్పించింది కదా అని భావించి ఆశతో అప్పట్లో ఆస్తులను అమ్ముకుని ప్లాట్లను తీసుకోవాల్సి వచ్చిందన్నారు. కొందరు ప్రైవేటు వ్యక్తులు ఐడీఎస్ఎంటీలో కొంతభాగం తమదంటూ అందులో రోడ్లను, పైపులైన్లను ధ్వంసం చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. బాధితులకు ప్రభుత్వం, పాలకులు, అధికారులు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్లాట్లను కొనుగోలు చేసిన బాధితులు, ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం.. వంతెనలు శిథిలం

- గంగాపూర్-ర్యాకల్ మధ్య ప్రమాదకరంగా వాగు వంతెన
- భారీ వాహనాలకు దారి మూసివేత
- రోడ్లపై మోకాలు లోతు గుంతలతో ప్రయాణం నరకం



సంజీవనరావుపేట, నాగ్‌ధర్ క్రాస్‌రోడ్స్ వరకు రోడ్డు దుస్థితి

నారాయణఖేడ్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): : నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఇటీవల కురిసిన కుండపోత వర్షాలకు రోడ్లు, వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఖేడ్ మండలం గంగాపూర్-ర్యాకల్‌ల మధ్య ఉన్న వాగు వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనపై భారీ వాహనాలు వెళ్తే కూలిపోయే పరిస్థితి ఉండడంతో అధికారులు అప్రమత్తమై, భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీనికి తోడు, నారాయణఖేడ్ సమీపంలోని మన్సూర్‌పూర్ వాగుపై ఉన్న వంతెన, అలాగే మాద్వార్ వంతెనలు కూడా శిథిలావస్థకు చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఖాంజీపూర్ సమీపంలోని వంతెన నిర్మాణం అసంపూర్తిగా వదిలివేయడంతో ప్రయాణం మరింత కష్టతరంగా మారింది. వర్షాల కారణంగా రోడ్లపై ఏర్పడిన గోతులు వాహన చోదకులకు నరకాన్ని చూపిస్తున్నాయి. నారాయణఖేడ్ నుంచి సిర్గాపూర్ వెళ్లే మార్గంలో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు పనులు వర్షం కారణంగా మరింత అధ్వాన్నంగా తయారయ్యాయి. అత్యంత దారుణంగా మూడు గుంటలు క్రాస్ రోడ్స్ నుంచి సంజీవనరావుపేట, నాగ్‌ధర్ క్రాస్‌రోడ్స్ వరకు రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. అనేక చోట్ల మోకాలు లోతు గుంతలు ఏర్పడడంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



గంగాపూర్-ర్యాకల్‌ల మధ్య ధ్వంసమైన వంతెన



శివ్వంపేటలో 25కోట్లతో నిర్మించిన సంపు

నర్సాపూర్‌కు నీటి గోస

మంజీర పైపులైన్ లీకేజీతో494 గ్రామాలకు నిలిచిన సరఫరా

- శివ్వంపేట సంపు నుంచి నీటిని అందించే వీలున్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ట్యాంకర్లపై ఆధారపడుతున్న ప్రజలు

నర్సాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మంజీర నది నుంచి మిషన్ భగీరథ ద్వారా నర్సాపూర్ నియోజకవర్గానికి సరఫరా అయ్యే తాగునీరు ప్రధాన పైపులైన్ లీకేజీల కారణంగా గత కొన్ని రోజులుగా నిలిచిపోయింది. దీంతో నిండుగా వర్షాలు పడుతున్న సమయంలో కూడా నర్సాపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల ప్రజలకు మంచినీటి గోస తప్పడం లేదు. సమస్యను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మంజీర నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం

నర్సాపూర్ నియోజకవర్గంలోని నర్సాపూర్, కౌడిపల్లి, చిలప్‌చెడ్, హత్నూర, శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేట, కొల్చారం మండలాలతో పాటు పటాన్‌చెరు నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు మంజీర నదికి సమీపంలో ఉన్న చక్రియాల్ వద్ద ఉన్న ఇంటెక్ వెల్ నుంచి నీరు సరఫరా అవుతుంది. ఈ నీరు హత్నూర మండలం బోర్పట్ల వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్‌లో శుద్ధి అయ్యాక మొత్తం 494 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా అందుతుంది.

ట్యాంకర్లే దిక్కు..

అయితే, ఇటీవల ప్రధాన పైపులైన్లు తరచూ లీకేజీ అవుతుండటంతో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. తాజాగా వారం రోజుల క్రితం చక్రియాల్ వద్ద ప్రధాన పైపులైన్ లీకేజీ అయినప్పటికీ, వరద నీటి ప్రవాహం కారణంగా మరమ్మతులు చేయలేకపోయారు. అందుకు మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉండటంతో, ప్రత్యామ్నాయంగా స్థానికంగా ఉన్న బోర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు సూచించారు. దీంతో గ్రామ పంచాయతీల ద్వారా వేసిన బోర్ల నీటిని అందిస్తున్నప్పటికీ, అది ప్రజల తాగునీటి అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. ఫలితంగా, నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో సహా అనేక గ్రామాల్లో ప్రజలు మంచినీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది.

నిష్ప్రయోజనంగా గోదావరి సంపు

మరోవైపు, నర్సాపూర్ ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం శివ్వంపేటలో రూ.25 కోట్లతో ఒక ప్రత్యేక సంపును నిర్మించింది. దీనికి గజ్వేల్ నియోజకవర్గం కోమటిబండ నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా గోదావరి నీటిని తరలించి నిల్వ చేసి, అవసరమైనప్పుడు నియోజకవర్గానికి సరఫరా చేసేలా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మంజీర నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిన ఈ క్లిష్ట సమయంలో, ఈ సంపును వినియోగించుకునే అవకాశమున్నది. చిన్నచిన్న మరమ్మతులు చేసి గోదావరి నీటిని నియోజకవర్గంలోని గ్రామాలకు అందించే మార్గం ఉన్నప్పటికీ, దాని గురించి అధికారులు, నేతలు ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ సంపు నిష్ప్రయోజనంగా ఉండటం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు తాగునీటి కోసం ఇంతగా ఇబ్బందులు పడుతున్నా, నాయకులు, అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.



ట్యాంకర్ల ద్వారా తాగు నీటి సరఫరా

న్యూస్ బాక్స్

హరీశ్‌రావును విమర్శించే స్థాయి కాదు : బీఆర్ఎస్

జోగిపేట రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అలయ్, బలయ్ కార్యక్రమాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు రాజకీయం చేశారని కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ నాయకులు ఖండించారు. అందోల్ మండల పరిధిలోని సంగుపేట వద్ద గల ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నాం కనుకే వాస్తవాలు మాట్లాడామని, దీనిని విమర్శగా తీసుకోవడం కాంగ్రెస్ నాయకులకే చెల్లుతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరుచేసిన అభివృద్ధి పనులకే సీఎం రేవంత్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవాలు జరుపుతున్నారంటూ ఆరోపించారు. హరీశ్‌రావును, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌ను, బీఆర్ఎస్‌ను విమర్శిస్తే ఊరుకోమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ విప్ నారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ డీబీ నాగభూషణం, మాజి ఎంపీపీ చంద్రయ్య, టేక్మాల్, పుల్కల్ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

'పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి'



నిరసన తెలుపుతున్న తండావాసులు

కంగ్టి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జీర్గితండా పంచాయతీ పరిధిలోని రాంసింగ్‌తండాలో స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు తండావాసులు కోరారు. ఈ విషయమై బుధవారం ఎంపీడీవో సత్తయ్యకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 170 మంది ఓటర్లు ఉన్న రాంసింగ్‌తండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో ప్రతీ ఎన్నికలకు నాలుగు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లి ఓట్లు వేయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జిన్నారం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల కేవీ 33 సబ్ స్టేషన్‌లో మరమ్మతుల వల్ల జిన్నారం మండలం, పారిశ్రామికవాడలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ దుర్గాప్రసాద్, ఏఈలు రవీందర్, వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలు గమనించాలన్నారు.

బెస్ట్ సూపర్‌వైజర్‌గా ప్రశాంతి



జిల్లా సంక్షేమాధికారి లలితాకుమారి నుంచి అవార్డు అందుకుంటున్న ప్రశాంతి

నారాయణఖేడ్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పోషణ్ మహోత్సవంలో భాగంగా బెస్ట్ సూపర్‌వైజర్‌గా నారాయణఖేడ్ ఐసీడీసీ ప్రాజెక్టు పరిధిలోని ప్రశాంతి ఎన్నికయ్యారు. 8వ పోషణ్ మహోత్సవంలో ప్రశాంతి చక్కటి కార్యక్రమాలను చేపట్టడంతో జిల్లా సంక్షేమాధికారి బుధవారం ఉత్తమ సూపర్‌వైజర్‌గా ఎంపిక చేసి అవార్డు అందించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సుజాత, ఏసీడీపీవో సుశీల, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల్లో అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలి

నారాయణఖేడ్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని షెట్కార్ థియేటర్ రోడ్డు సమీపంలోని వక్ఫ్ బోర్డు భూముల్లో కొందరు ఎక్స్‌కవేటర్లతో చదును చేసి షెడ్ల నిర్మాణానికి పూనుకున్నందున అధికారులు అడ్డుకోవాలని ఎంఐఎం అధ్యక్షుడు మోహీద్‌పటేల్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంఐఎం నాయకులు మజార్, ఆగుకతీబ్, మిస్బా తదితరులు ఉన్నారు.

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

- పట్టించుకోని అధికారులు
- ఇక్కట్లు పడుతున్న ప్రజలు

ఝరాసంగం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఝరాసంగంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఎంపీడీవో కార్యాలయం పక్కనే తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండడంతో భూములు విక్రయించిన వారు కార్లలో వచ్చి రోడ్డుకు ఇరువైపులా నిలపడంతో ఇబ్బందులు తప్పడం లేదు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట విశాలమైన స్థలం ఉన్నా.. ఆ ప్రదేశం వర్షాల కారణంగా బురదమయంగా మారింది. రెవెన్యూ అధికారులు శ్రద్ధ వహించి ఖాళీ స్థలంలో ఎర్రమట్టి వేయిస్తే ఎలాంటి సమస్య ఉండదు. కానీ వారు పట్టించుకోకపోవడం వల్లే వాహనలను ఎక్కడపడితే అక్కడ నిలుపుతున్నారు. ద్విచక్ర వాహనాలపై కార్యాలయాలకు వెళ్లాలంటేనే ఏ వాహనం తాకుతుందోననే భయాందోళనకు ప్రజలు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎంపీడీవో కార్యాలయానికి ఎదురుగా రోడ్డుపై వాహనాల పార్కింగ్

దూది రైతు దుఃఖం

(5వ పేజీ తరువాయి)

తేల్చారు. అయితే, క్షేత్రస్థాయిలో నష్టం ఇంకా అధికంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు.

కొనుగోళ్లపై సందిగ్ధత

పంట నీట మునిగి దిగుబడి పడిపోతున్న నేపథ్యంలో, పత్తిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న సన్నాహాలు ప్రశ్నార్థకంగా మారాయి. ప్రభుత్వం వచ్చే నెల నుంచి పత్తిని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం సదాశివపేట, రాయికోడ్, నారాయణఖేడ్, జోగిపేట, వట్‌పల్లి మార్కెట్ యార్డులతో పాటు 24 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు దిశానిర్దేశం చేశారు. సేకరించిన పత్తిని నిల్వ చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 37 గోదాములను గుర్తించారు. వీటిలో 95,432 మెట్రిక్ టన్నుల పత్తిని నిల్వ ఉంచే వీలుందని అధికారులు తెలిపారు. పత్తికి క్వింటాలుకు రూ.8,110 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది. అయితే, పంట చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కాంగ్రెస్ హామీలతో రాష్ట్ర ప్రజలు మోసపోయారు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి
- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కొండాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం మల్కాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్‌కు చెందిన మల్లేపల్లి మాజీ సర్పంచ్ శివలీలజగదీశ్వర్ తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, మహిళలకు గృహలక్ష్మీ, గృహజ్యోతి, నిరుద్యోగ భృతి, రైతు రుణ మాఫీ పథకాల అమలులో కాంగ్రెస్ పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ఉండి స్థానిక సంస్థల



బీఆర్ఎస్‌లో చేరుతున్న మాజీ సర్పంచ్ శివలీలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభాకర్

ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఇంటికి బీఆర్ఎస్ అందించిన పథకాల గురించి ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం, మాజీ జడ్పీటీసీలు కొండల్‌రెడ్డి, మనోహర్‌గౌడ్, పాండురంగాం, మల్లాగౌడ్, మండల పార్టీ అధ్యక్షకార్యదర్శులు విఠల్, గోవర్దన్‌రెడ్డి,డా, శ్రీహరి, మాజీ ఎంపీటీసీలు,సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యానికి సీఎం సహాయనిధి



మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు మెరుగైన వైద్యమందించే విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదలకు చెందిన ఉమారాణికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల పత్రాన్ని పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

దత్తగిరి ఆశ్రమంలో ఎస్పీ పూజలు



నవగ్రహాలకు పూజలు చేస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్

ఝరాసంగం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేద మంత్రోశ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆశ్రమంలోని జ్యోతిర్లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ ఆవరణలో కొనసాగుతున్న మృత్యుంజయ హోమంలో ఎస్పీ పాల్గొన్నారు. ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖమణి అవదూత గిరిమహరాజ్ శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఎస్పీ వెంట డీఎస్పీ సైదా, సీఐ హనుమంతు, ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ ఉన్నారు.

చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలం

- జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి

నారాయణఖేడ్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మనం నిత్యం ఉపయోగించే చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయని జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి అన్నారు. బుధవారం ఖేడ్‌లో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణమాసం, గర్భిణులకు సీమంతం, అన్నప్రసాద, అక్షరాభ్యాసం, బేటి బచావో...బేటి పడావో, మిషన్ పరివర్తనపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బాలికలు, తల్లులకు పోషకాహారం చాలా అవసరమన్నారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులకు చిరుధాన్యాలతో పాటు సరైన



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న లలితకుమారి

పోషకాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త సౌమ్య, ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సుజాత, ఏసీడీపీవో సుశీల పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు




కబడ్డీ పోటీల్లో తలపడుతున్న జట్లు

మెదక్ అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో మైదానంలో అండర్-17 బాలబాలికలకు నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లాలోని అన్ని మండలాల నుంచి 19 జట్లు తలపడ్డాయి. బాలుర విభాగంలో మెదక్, తూప్రాన్, కౌడిపల్లి, బాలికల విభాగంలో మెదక్, కౌడిపల్లి, రామాయంపేట విజేతలుగా నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి డీఈవో రాధాకిషన్ హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఎంపికైన జట్లు ఈనెల 10 సంగారెడ్డిలో జరిగే ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీఈటీల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌రెడ్డి, పీడీలు మాధవరెడ్డి, కిషోర్, దేవేందర్‌రెడ్డి, నరేష్, రవి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పార్టీ కోసం కష్టపడాలి: మైనంపల్లి

మనోహరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ టికెట్ పొందినవారి విజయం కోసం ప్రతీ ఒక్క కార్యకర్త కష్టపడాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతురావు సూచించారు. బుధవారం మెదక్ పర్యటనలో భాగంగా మనోహరాబాద్ మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డిని తన నివాసంలో కలిశారు. ముప్పిరెడ్డిపల్లి నుంచి కాళ్లకల్ వేళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, మరమ్మతులు చేయాలని కాళ్లకల్ గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన మైనంపల్లి వెంటనే జిల్లా డీపీవోతో ఫోన్‌లో మాట్లాడి మరమ్మతు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయ



రోడ్డు బాగు చేయాలని హనుమంతరావుకు వినతిపత్రం అందజేస్తున్న కాళ్లకల్ గ్రామస్థులు

కులు మహిపాల్‌రెడ్డి, జావిద్‌పాషా, నాగరాజుగౌడ్, బాబాచారి, యాదగిరి, ధర్మేందర్, నవీన్, ఇతర మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు

నారాయణఖేడ్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని నెహ్రూనగర్ సమీపంలో పైప్‌లైన్ లీకేజీ కారణంగా పలు గ్రామాలు, తండాలకు కొద్దిరోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో బుధవారం మరమ్మతు పనులు చేపట్టారు. మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ సబ్ కలెక్టర్ ఉమాహారతికి పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టి, తాగునీటి సరఫరాను పునరుద్ధరింపజేయాలని మంగళవారం ఫిర్యాదు చేసింది. ఆమె ఆదేశాలతో మిషన్ భగీరథ డీఈఈ ఫణివర్మ, గ్రిడ్ ఏఈ సాయికిషోర్ పర్యవేక్షణలో మరమ్మతులు నిర్వహిస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : రాజిరెడ్డి

వెల్దుర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యశ్వంతరావ్‌పేటలో గాంధీ జయంతి రోజున మహాత్ముడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన చోటే నూతన విగ్రహాన్ని ప్రతిష్టించడంతో బుధవారం యశ్వంతరావ్‌పేటలో ఆయన గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. ప్రపంచంలోని నెల్సన్‌మండేలా వంటి ప్రముఖుడు గాంధీని గురువుగా భావించి ఆదర్శంగా తీసుకుంటే మన భారతదేశంలో ఆయన విగ్రహాలను ధ్వంసం చేయడం దారుణమన్నారు. నిందితుల వైఖరిని ఖండించి వారికి శిక్షపడేలా చేయాల్సిన ఓ జాతీయ పార్టీ జిల్లా అధ్యక్షుడు దుండగులకు వత్తాసు పలికేలా పోలీస్‌స్టేషన్‌లో ఉండడం దుర్మార్గమన్నారు.



గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న రాజిరెడ్డి

ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మల్లేశం, పోతిరెడ్డి, రామకృష్ణారావ్, కుస్తి శేఖర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ ప్రకారం విద్యార్థులు అప్‌డేట్ కావాలి

- ఏఆర్ వీఆర్ ప్రయోగశాలలను ప్రారంభించిన డీఈవో



ఏఆర్, వీఆర్‌ల ద్వారా స్ర్కీన్‌ను వీక్షిస్తున్న డీఈవో, ఎంఈవో

రామచంద్రాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న టెక్నాలజీ ప్రకారం విద్యార్థులు అప్‌డేట్ కావాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం తెల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఆర్, వీఆర్ ప్రయోగశాలను ప్రారంభించారు. ఈ ప్రయోగశాలకు ఒక్కో పాఠశాలకు రూ.11 లక్షల మెటీరియల్. ఏఆర్, వీఆర్ డివైజ్‌లు 10, టాబ్లెట్ పీసీ 1, ఛార్జింగ్ స్టోరేజ్ 1, బీన్ బ్యాగ్ చైర్స్ 10 ఇవ్వడం జరిగిందన్నారు. దీని ద్వారా విద్యార్థులకు ఆగ్మెంటెడ్ రియాల్టీ(ఏఆర్), వర్చువల్ రియాల్టీ(వీఆర్) ద్వార పాఠ్యపుస్తకాలను కంటెంట్ డెవలప్‌మెంట్ చేశారని డీఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పీపీ రాథోడ్ పాల్గొన్నారు.

పార్కుల్లో శుభ్రత పాటించండి : కార్పొరేటర్



సమీక్ష నిర్వహిస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆహ్లాదకరమైన పార్కుల్లో నిత్యం శుభ్రత పాటించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు. బుధవారం భారతీనగర్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. పార్కుల్లోని వ్యర్థాలు, పబ్లిక్ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన చెత్త పాయింట్లు తొలగించాలని కోరారు. వర్షాలకు రోడ్లపై పడిన గుంతలు పూడ్చివేయాలని చెప్పారు. రద్దీ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్స్ తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపకమిషనర్ సురేష్, డీఈ దేవేందర్, విజయరామారావు తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి అధ్యాపకుల నిరసన



సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు సీజేఐపై న్యాయవాది దాడికి నిరసనగా సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం నిరసన తెలిపారు. సీజేఐపై జరిగిన దాడిని ప్రిన్సిపాల్ అరుణాబాయి, అధ్యాపకులు తీవ్రంగా ఖండించారు. అత్యున్నత హోదాలో ఉన్న సీజేఐపై దాడి చేయడమంటే దేశరాజ్యాంగానికే మాయని మచ్చని ప్రిన్సిపాల్ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడికి పాల్పడడం గర్హణీయమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇసోజిపేటలో విత్తన క్షేత్రాల పరిశీలన



ఇసోజిపేటలో వరి విత్తన క్షేత్రం వద్ద వ్యవసాయ శాస్త్రవేత్తలు

పుల్‌కల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసోజిపేట గ్రామంలో వరి విత్తన క్షేత్రాలను తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం(టీఆర్‌వీకే) సంగుపేట శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో గ్రామానికి చెందిన పలువురు రైతులకు చిరు సంచుల వరి విత్తనాలను అందజేయడంతో వారు సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగానే వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.నిర్మల, కె.అరుణ, కె.రాహుల్‌విశ్వకర్మ గ్రామాన్ని సందర్శించారు. వరి పంటలో చిరు సంచుల ప్రయోగదశలో ఉన్న ఆర్ఎన్ఆర్-35008 అనే రకం రెండో సంవత్సరం ప్రయోగంలో ఉన్నదని తెలిపారు. ఈ రకం దొడ్డు గింజ గుణం గల విత్తనం 120 రోజుల నుంచి 125 రోజులు కలిగి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గొల్ల వెంకటేశం, మంగలి రాములు, చెల్ల ముత్యంరెడ్డి, చాకలి మల్లేశం, తెలంగాణ రైతువిజ్ఞాన కేంద్ర యంగ్ ప్రొఫెసర్ ఎస్.శ్రీకాంత్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి



కంది పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ ప్రొఫెసర్, అధికారులు

కొండాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడిని సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త సుశీల పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్‌లో మండల వ్యవసాయాధికారులతో కలిసి ఆమె కంది పంటను పరిశీలించారు. కంది విత్తనం కేఎస్ఎమ్ 1638, వరిలో డబ్ల్యూజీ 97 రకాల విత్తనాల పంటలను సాగు చేస్తున్న రైతులను దిగుబడిపై అరాతీశారు. ఆమె వెంట ఏవో గణేష్, ఏఈవో ప్రేమ్‌రాజ్, పీఏసీఎస్, ఐకేపీ సిబ్బంది, రైతులు ఉన్నారు.

వైభవంగా భవానీమాత పల్లకీసేవ



భవానీమాత పల్లకీ సేవలో భక్తులు

పెద్దశంకరంపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలో భవానీమాత పల్లకీసేవ మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి పూజలు చేసిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో అమ్మవారిని ఉంచి పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా చేపట్టారు. పేట పట్టణంలోని ఆయా ఆలయాల భజన మండలి సభ్యులు భజనలు చేస్తూ పల్లకీ సేవ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఆర్ఎస్.సంతోషకుమార్, శ్రీనివాస్, భజన మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ బిల్లులు ఎప్పుడిస్తరు?

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. బెస్ట్ అవైలబుల్ పథకం కింద ఎంపికైన ఎస్సీ, ఎస్టీ నిరుపేద విద్యార్థులకు 1వ తరగతి నుంచి పదవ తరగతి వరకు ప్రైవేటు స్కూళ్లలో చదువుకుంటున్నారని అన్నారు. బిల్లులు రాక విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయని వెంటనే ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బిల్లులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్, రమేష్ తదితరులు ఉన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్లకు సన్నద్ధం

- ఏర్పాట్ల ప్రక్రియ పూర్తిచేసినట్లు ప్రకటించిన అధికారులు

జహీరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేశామని ఆర్డీవో దేవుజ, తహసీల్దార్ దశరత్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 9 నుంచి 11వ తేదీవరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగ నున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేశామన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోనే ఏర్పాట్ల ప్రక్రియ ఉన్నందున పోటీచేసే అభ్యర్థులు అధికారులకు సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ శివలింగం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో దేవుజ, తదితరులు

దీనికోసం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో జాకీర్‌హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి : ఎంపీడీవో

పెద్దశంకరంపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేట మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని అసిస్టెంట్ జిల్లా ఎలక్షన్ అథారిటీ అధికారి, ఎంపీడీవో షాకీర్‌అలీ, ఎలక్షన్ అధికారి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మండలంలో 12 ఎంపీటీసీ, 1 జడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు జరుగనున్నట్లు,

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

రామాయంపేట/నిజాంపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికలకు సంబంధించి నేటి నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నామని ఎంపీడీవో, ఎన్నికల జిల్లా సహాయ అధికారి సాజిరుద్దీన్ ప్రకటించారు. జడ్పీటీసీ నామినేషన్లు మండల పరిషత్ కార్యాలయంలో, ఎంపీటీసీ నామినేషన్లను ఐకేపీ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. అలాగే నిజాంపేట మండలానికి సంబంధించి గ్రామపంచాయతీ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు ఇవ్వాల్సిందిగా రాజిరెడ్డి పేర్కొన్నారు.